# అమ్మ

కాకాని కమల




అర్ధరాత్రి

సమయం పన్నెండు గంటలు కావస్తోంది

గడియారం టిక్ టిక్ మన్న శబ్దంతప్ప ఇతరత్రా ఏ చిన్న అలికిడి లేదు

మధ్య హాలులో వెలుగుతున్న చిన్న నీలిరంగు బెడ్‌లైటు వెలుతురు మినహా ఇల్లంతా చీకటిగా వుంది

దక్షిణంవైపు వున్న పడకగదిలో శేషాద్రి, అతని భార్య, ఎసారా అరుగుమీద పనివాడు రంగన్న హాయిగా ఆదమరిచి నిద్రపోతున్నారు

కాని హాలుకి ఎడం ప్రక్కనవున్న గదిలో చిన్న మంచంలో ఒంటరిగా పడుకున్న 'శీనూ'కి మాత్రం నిద్ర పట్టటంలేదు

కళ్ళు తెరుచుకుని అలా నిశ్శబ్దంగా చీకట్లోకి చూస్తూ పడుకున్నాడు

''అమ్మ'' బ్రతికున్నప్పుడైతే అసలు శీనూకి నిద్ర పట్టకపోవటం అంటూ లేదు

తులసికోట దగ్గర సందెదీపం వెలిగించగావే అమ్మ

"శీనూ ! పొద్దుగూకింది అన్నం తిందువు గాని రా " అంటూ వెండి కంచంలో వేడి వేడిగా అన్నం ఒడ్డించి నెయ్యి, కూర వేసి గడ్డ పెరుగుతో దగ్గరుండి కొసరి కొసరి కడుపునిండా తినిపించేది

శీనూ అన్నం ఎక్కువైందని ఆయాస పడితే – అమ్మ శీనూ గుండెలమీద అరచేత్తో రాస్తూ, "జీర్ణం జీర్ణం వాతపి జీర్ణం – శీను గాడు తిన్న బువ్వంతా జీర్ణం .." అని శీనుని నవ్వించేది. ఆ తరువాత మెత్తగా పక్కవేసి పడుకోబెట్టి లాలనగా చిచ్చుకొడుతూ

"రామా లాలీ – మేఘశ్యామా లాలీ

తామారస నయున దశరధ తనయా లాలీ"

అంటూ తియ్యని కంఠంతో జోల పాడేది

కాని ఇప్పుడెవరున్నారని ?

ఇదివరకసలు ఎప్పుడైనా ఇలా నిద్రపట్టక పోవటం అంటూ వుందా ?

శీనూ ఒంటరిగా ఇలా పడుకుని ఎర్గుగునా?

కాని ఇప్పుడు ?

అమ్మ చచ్చిపోయింది . అన్ని కరువై పోయినాయ్ నిద్ర కూడా కరువై పోయింది

శీనూకి తల్లి జ్ఞాపకం వచ్చింది

కళ్లనిండా గిర్రున నీళ్ళు నిండాయి కన్నీరు చుక్కలు చుక్కలుగ ధారలు కట్టి కనుకొలుకు ల్లోంచి జారి దిండులోకి ఇంకి పొయ్యాయి

శీనూ అలాగే నిశ్శబ్దంగా వెక్కిళ్ళు పెడుతూ చీకట్లోకి చూస్తూ వుండిపొయ్యాడు.

ఇందాక గడియారం పది కొట్టటం విన్నాడు

పదకొండు కొట్టటం విన్నాడు

ఆ తరువాత "ఠంగ్ " మని అరగంట కూడా కొట్టింది.

టిక్ .టిక్ అన్న శబ్దం తప్ప మిగతా అంతా నిశ్శబ్దం

చీకట్లోకి చూస్తూ చెవులు రిక్కించి "పన్నెండు గంటలు" ఎప్పుడు అవుతుందా అని ఎదురు చూస్తున్నాడు శీనూ .

ఈ రాత్రి శీనూ ఒక చిన్న దొంగతనం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు

గోపి చెప్పాడు దొంగతనం ఎప్పుడూ సరిగ్గా అర్థరాత్రి పన్నెండింటికే చెయ్యాలని

ఆ సమయంలో అయితే అంతా నిద్రపోతూ వుంటారని పని సులువుగా జరిగిపోతుందని కూడా చెప్పాడు.

అందాకా ఆ సమయంకోసం కాచు క్కూర్చున్నాడు

శీనూ ఒక్కసారి దీర్ఘంగా వూపిరి తీసుకుని దుప్పటి సరిగ్గా కప్పకుని కాస్త పక్కకి ఒరిగి పడుకున్నాడు చలి బాగానే వుంది

అయినా సరే నిద్రపోదల్చుకోలేదు

ఎలాగయినా సరే తనకి కొంచెం డబ్బు కావాలి. కనీసం నాలుగు రూపాయలన్నా కావాలి

నాన్నని అడిగితే ఇవ్వడు. సరికదా ."వెధవ్వి లేవు నీకంత డబ్బెందుకురా?" అని తిడతాడు

ఎప్పుడైనా ఐసుఫ్రూట్ కొనుక్కోమని పది పైసలు ఇస్తాడు లేకపోతే పావలానో అర్ధో ఇస్తాడు. అంతకుమించి ఒక్క పైసా ఎక్కువ ఇవ్వడు

"నీకేం కావాలో చెప్పూ కొనిస్తాను." అంటాడు మొన్నేం జరిగింది ?

కొత్త పిన్ని పోపుల డబ్బాలో చిల్లర డబ్బులు పెడితే పోయాయట!

"ఈ శీనుగాడే తీసుంటాడు" అంటూ నాన్నకి ఫిర్యాదు చేసింది

అంతే !

నాన్న తన దగ్గరకి వచ్చి–

"ఏంరా ? చదువు లేనేలేదు దొంగతనం కూడా మొదలు పెట్టావా ? వెధవా ." అంటూ తన చెంపమీద ఛెళ్ళున కొట్టాడు ఎంత చురికిందని ? ఆ రోజంతా చెంప మండుతూనే వుంది,

నిజానికి ఆ డబ్బు తను తియ్యలేదు

ఆ చిల్లర పైసల సంగతి తనకసలు తెలియదు

కొత్త పిన్నికి తనంటే కోపం. అందుకే అస్తమానం తనమీద నాన్నకి అలా కొండేలు చెపుతుంది నాన్న అవన్నీ నమ్మేస్తాడు తనని కొడతాడు తను నిజం చెప్పినా నమ్మడు

అందుకే తను నాన్నకి ఏమీ చెప్పటం, అడగటం మానేసాడు.

అసలు అమ్మ చచ్చిపోయ్యాక నాన్నతో మాట్లాడటమే మానేశాడు

ఎందుకు మాట్లాడటం ?

నాన్నకి కొత్త పిన్ని అంటేనే ఇష్టం ఇవన్నీ అమ్మకి చెప్పాలి

అందుకే ఇప్పుడు తనకి నిజంగానే కొంచెం డబ్బు కావాలి

గోపి చెప్పాడు కనీసం నాలుగు రూపాయ లన్నవుంటేగాని సరిపోవని

నాన్నని అడిగితే ఇవ్వడు పైగా ఎప్పుడూ తోకలా పక్కన పిన్ని !

అందుకే ఈ రోజు దొంగతనం చెయ్య టానికే నిర్ణయించుకున్నాడు

గోపి చెప్పాడు 'సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలు అవ్వగానే నెమ్మదిగా లేచి మీ నాన్న జేబులోంచి ఓ నాలుగు రూపాయిలు తీసుకురా" అని, ఆ తరువాత ఏం చెయ్యాలో తనకి బాగా తెలుసునని ఆ విషయం తను చూసుకొంటానని చెప్పాడు.

"ఆ డబ్బుతో ఆ డబ్బుతో అమ్మకి ఉ "

"ఠంగ్ . ఠంగ్.. ఠంగ్ . "

శీను ఉలిక్కిపడి మంచంలో లేచి కూర్చు న్నాడు

గడియారం "ఠంగ్ ఠంగ్ " మని గంటలు కొడుతుంటే గుండెల మీద చెయ్యేసు కుని పన్నెండు గంటలు లెక్క పెట్టాడు

తరువాత గంటలు ఆగిపొయ్యాయి

తిరిగి ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించింది

టిక్ టిక్ మన్న గడియారం అలికిడి మినహా ఇతరత్రా ఏ చిన్న అలికిడి లేదు

శీను వూపిరి బిగపట్టి మెల్లగా మంచం దిగి పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ మధ్య హాలులోకి వచ్చాడు

మనసులో చాలా భయంగా వుంది

ఒళ్లంతా మంచులా గడ్డ కట్టుకుపోతోంది

కాళ్ళు చేతులూ స్వాధీనం తప్పినట్లు తడబడి పోతున్నాయ్

ఒక్క క్షణం వెనక్కు వెళ్ళిపోదామా అని పించింది కాని మనసు మొరాయించింది

శీను ధైర్యాన్ని కూడ గట్టుకున్నాడు

"ఊహూఁ తను ఎలాగైనా సరే అమ్మ దగ్గరికి వెళ్లిపోవాలి కాని ఆ విషయం మరి అమ్మకి తెలియాలి కదా? తెలియాలంటే డబ్బు కావాలి కదా? కనీసం నాలుగు రూపాయలన్న అవసరం వుంటాయని కదా చెప్పాడు గోపి "

శీనూ శక్తిని కూడదీసుకున్నాడు

ప్రాణాలు బిగ పట్టుకుని ముందుకు అడుగులు వేశాడు

తండ్రి పడుకున్న గది దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా తలుపు తోశాడు

లోపల గడియలు వెయ్యక పోవటంతో వెంటనే ఓరవాకిలిగా తెరుచుకుంది

కొత్త పిన్ని, తండ్రి ఒకే మంచంమీద గాఢనిద్రలో మునిగిపోయి వున్నారు

శీను వూపిరి బిగపట్టి చప్పుడు కాకుండా పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ బట్టల స్టాండు దగ్గరకి వెళ్ళి నిల్చున్నాడు

తండ్రి పాంటుపై హాంగర్ని వేసి వుండటంతో శీనూకి అందలేదు

కాళ్ళు పైకెత్తి చెయ్యి చాచాడు

ఊహూఁ

అయినా అందలేదు

శీనుకి ఒక్కక్షణం అయోమయంగా అయ్యింది

ఎటూ తోచలేదు

భయంతో గుండె జారిపోతోంది

చలికాలం అయినా మదురంతా ధారగా చెమటలు కారిపోతున్నాయి

ప్రాణం చిక్క పట్టుకుని జారుతున్న నిక్కరు పైకి లాక్కున్నాడు

భయంతో శరీరం తుఫానులో ఆకులా ఒణికిపోతోంది

ఒక్కక్షణం తిరిగి వెనక్కివెళ్లి పారిపోదాం అనిపించి వెనుతిరిగాడు

కాని అంతలోనే 'అమ్మ' జ్ఞాపకం వచ్చింది, దాంతోపాటే కొత్త పిన్ని తిట్లు, తండ్రి కొత్త

దెబ్బలు.. అన్నీ.. జ్ఞాపకం వస్తాయి. కూడుకున్నా మనసుకి మరింత గుచ్చుకున్నట్టు అయ్యింది.

"ఊహూఁ లేదు తను ఇలాగే వుండలేడు. ఎలాగైనా సరే అమ్మ దగ్గరికి వెళ్ళిపోవాలి. మరి.....ఆ విషయం అమ్మకి తెలియాలి కదా?

తెలియాలంటే డబ్బు కావాలి కదా?

అయితే.. అయితే ఎలాగైనా తను ఈ రాత్రి దొంగతనం చెయ్యాలి.

ఇంతకు ముందు పొద్దున డబ్బాలో పెట్టిన చిల్లర డబ్బులు పోయాయని పిన్ని నాన్నకి ఫిర్యాదు చేసింది

నాన్న ఆ మాటలు నమ్మి తను చెడిపోతున్నా డని ఆరోజు బాగా కొట్టాడు.

కాని నిజంగా ఆ చిల్లర డబ్బుల సంగతి తనకి తెలియదు. తను తియ్యలేదు.

కాని ఇప్పుడు తప్పనిసరిగా డబ్బులు కావాలి.

నాన్న పిన్ని లేస్తే తను తన్నులు తింటాడు.

పోనీ ...

తింటే తింటాడు.

తన్నులే కదా?

రోజూ తినటం లేదు గనుకనా?

ఈ ఒక్కసారి అమ్మ కోసం మళ్లీ తన్నులు తింటాడు

అమ్మంటే తనకెంత ఇష్టం?

అమ్మ వున్నప్పుడు నాన్న ఒక్కసారైనా తనని కొట్టలేదు.

కాని ఇప్పుడో.....?

అస్తమానం కొడతాడు..

ఇప్పుడు మళ్ళీ కొడతాడు.

కొట్టనీ.. ..

శీనుకో కొత్తగా మొండితనం వచ్చింది..

నిశ్శబ్దంగా నాలుగు అడుగులు వేసి గోడ వారగా వున్న స్టూలు దగ్గరికి వెళ్ళాడు.

దాని మీద వున్న మంచి నీళ్ల చెంబు కింద పెట్టి నెమ్మదిగా స్టూలు తెచ్చి స్టాండు దగ్గర వేశాడు.

మళ్ళీ శీనుకో పిరికితనం వచ్చి చేరింది.

ఎంత ధైర్యంగా వుందామన్నా గుండె దడ హెచ్చుతోందే గాని తగ్గటం లేదు.

కాళ్ళు చేతులూ గజగజ వణికిపోతున్నాయి.

గుండె ఆగిపోతుందేమో అన్నంత భయంగా వుంది.

స్నానం చేసినట్టు ఒళ్ళంతా చెమటతో తడిసి పోతుంది.

శీను అతికష్టంతో ధైర్యాన్ని కూడ గట్టుకుని స్టూలు మీదకి ఎక్కి తండ్రి పెంటు జేబులోంచి పర్సు బయటికి తీశాడు.

శీనూ కళ్ళు మెరిశాయి.

పర్సు బరువుగా వుంది.

ఒణికే చేతుల్తో పర్సు తెరిచి కొన్ని నోట్లు బయటికితీసి తిరిగి శబ్దం లేకుండా పర్సు జేబులో



# అమ్మ

పెట్టబోతుంటే మంచం "కిర్రు"మన్న చప్పుడు, దానితోపాటే గాజుల గలగలా శబ్దం వినిపించాయి.

అంతే !!

భయంతో త్రుళ్ళిపడ్డాడు శీనూ

ఆ తొట్రుపాటుతో చేతుల్లోంచి పర్సు జారి కింద పడింది.

ఆ ఖంగారుతో గభాల్న స్టూలు దిగ బోతుంటే కాలు జారి స్టూలుతోసహా తల్లక్రిందులుగా అయి ధబ్బున జారి నేలమీద పడ్డాడు.

అంతే !!

"ఎవరు?.. ఎవరది?.." ఆ శబ్దానికి పులిక్కిపడి శేషాద్రి, భార్య గభాల్న మంచంలోంచి లేచి లైట్ స్విచ్ నొక్కారు.

క్షణాల్లో గదంతా వెలుతురు నిండిపోయింది

ఆ వెలుతురులో మంచం ప్రక్కగా చేతిలో డబ్బు నోట్లతో పడివున్న కొడుకుని, తల్లక్రిందులైన స్టూలుని పర్సుని చూడగానే పరిస్థితి తెలిసిన రుద్రుడిలా అయ్యాడు శేషాద్రి

పట్టుమని పదేళ్ళు నిండా లేని తన కొడుకు అర్ధరాత్రి తన పర్సులోంచే డబ్బు దొంగతనం చేస్తున్నాడు అనుకోగానే అతని గుండె భగ్గుమంది —

కళ్ళు చింత నిప్పుల్లా మండాయి.

"ఇంత చిన్న వయసులోనే నీకీ ఇంత నీచ బుద్ధి ఎలా అబ్బింది?"

శీను ఘటోత్కచుడిలా ఎదురుగా నిల్చున్న తండ్రి వుగ్రరూపం చూసి నిలువునా ఒణికి పోయాడు.

భయంతో బల్లిలా నేలకు అతుక్కుని పోయాడు.

"ఆ రోజు నేచెప్తే నామాటలు నమ్మలేదు ఈ రోజు చూస్తున్నారుగా మీ కొడుకు ప్రతాపం?" సుందరి వ్యంగ్యంగా చేతులూ మూతి తిప్పింది.

అంతే !

ఆ మాటతో శేషాద్రిలో రోషం తన్నుకొచ్చింది. ఆకలిగొన్న పులి లేడిపిల్లమీదకి దూకినట్టు గభాల్న కొడుకు గుండెలమీద ఎక్కి జుట్టుపట్టుకుని లేపి చెళ్ళున చెంపమీద వాయించాడు.

"ఏరా? అయితే మీ పిన్ని చెప్పిందంత నిజమే అన్నమాట? ఆపైకి దొంగతనాలుకూడా మొదలు పెట్టావట్రా? చెప్పరా.. నీకసలు ఇప్పుడు ఏం... తక్కువ చేశామని.... ఆపైకి దొంగతనాలు.. దొంగతనం కూడా మొదలెట్టావన్న మాట... దొంగ వెధవా.... నా కడుపున చెడబుట్టావు కదరా.." అంటూ చెళ్ళు చెళ్ళున ఇష్టం వచ్చినట్టు కొడుకుని అదిరిన దెబ్బలకు వెంటనే తిరిగి రాలేదు. దెబ్బలు వొప్పుకుంటుంటే

అరిచినప్పుడు కోపంతో "వెధవా ఛాస్ ఛా నా ఇంట్లోంచి ఛో" అంటూ కాలితో కొడుకుని ఒక్క తన్ను తన్నాడు.

ఆ విసురుకి త్రుళ్ళిపడి బంతిలా అంతెత్తున ఎగిరి "అమ్మా" అంటూ ధబ్బున గడప దగ్గర పడ్డాడు శీనూ

ఆ పడటంతో జేబులో నలిగిన కాగితం మడత గాలికి ఎగిరి శేషాద్రి కాళ్ళ దగ్గర పడింది.

"ఇదంతా నా ఖర్మ...అసలు నాకొచ్చింది కాదు చావు." సుందరి నసుక్కుంటూ సవతి కొడుకుని భుజానికెత్తుకుని ఇవతలికి వచ్చింది..

కొడుకు చెడిపోతున్నాడన్న బాధతో దెబ్బ తిన్న పులిలా గాండ్రిస్తూ మంచంలో కూలబడి కాళ్ళ దగ్గర పడ్డ కాగితం మడతవిప్పాడు.

ఆ కాగితం శీనూ తల్లికి రాసిన ఉత్తరం ఒంకర టింకర అక్షరాలతో తప్పులు, కొట్టి వేతలతో అందులో ఇలా వుంది

* * *

"అమ్మా !

నువ్వు చచ్చి పోయాక దేవుడి దగ్గరికి వెళ్ళి పోయావని గోపి చెప్పాడు. కొత్తపిన్ని మంచిది కాదు. అస్తమానం నాన్నతో చెప్పి నన్ను కొట్టిస్తూ వుంది

అమ్మా ! నువ్వు చచ్చిపోయాక ఇక్కడ నాకేమీ బాగుండటంలేదు నేను నీ కోసం బెంగ పెట్టుకున్నాను నువ్వు జ్ఞాపకం వస్తే నాకు ఏడుపు వస్తూ వుంది.

నన్ను కూడా తీసుకెళ్ళకుండా నువ్వు ఒక్కర్తివే దేవుడి దగ్గరికి ఎందుకు వెళ్ళి పోయావు?

ఉత్తరం రాస్తే ఎంత దూరంలో వున్న వాళ్ళకైనా అందుతుందని గోపి చెప్పాడు. నాన్నని డబ్బులు అడిగితే ఇవ్వడు. అందుకని నాన్న జేబులోంచి దొంగతనం చేసి స్టాంపులు కొనమని కూడా గోపీయే చెప్పాడు. అలాగే చేస్తాను మరి

ఈ ఉత్తరం అందిన వెంటనే నువ్వు ఒకసారి ఇక్కడికి రా అమ్మా.

నేను కూడా నీతోపాటు దేవుడి దగ్గరికి వచ్చేస్తా. మనం ఇద్దరం ఎంచక్కా ఆకాశంలో దేవుడి దగ్గర "

* * *

అంతే ! శేషాద్రికి తల గిర్రున తిరిగింది.

ఆ పైన అక్షరాలు కనిపించలేదు.

కళ్ళనిండా నీళ్లు నిండి అక్షరాలు అలుక్కు పోయాయి.

అంతవరకు భగ్గున మండుతున్న మనసు మీద చల్లని నీళ్లు కుండ గుమ్మరించి నట్లు నిలువునా నీరైపోయాడు.

కన్నీరు ధారగా చెంపల మీద జారుతుంటే "శీనూ .." అంటూ వెర్రి కేక పెట్టాడు. ★